క్లుప్తంగా

సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలి



జి.పెదపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని జి.పెదపూడిలో సోమవారం గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దంగేటి అన్నవరం, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు, నాయకులు కత్తుల విక్టర్‌బాబు, మానుకొండ నిర్మల తదితరులతో కలసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. జగన్ పాలనలో కుటుంబాల వారీగా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చిట్టిబాబు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పార్టీ నాయకులు దొమ్మేటి దుర్గారావు, సాధనాల రమేష్, ఈలి చంద్రరావు, పల్లి పండు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన కొప్పిసెడి శ్రీనివాసరావు–సత్యశ్రీలక్ష్మి దంపతులు సోమవారం రూ.25 వేలు విరాళంగా అందించారు. వారికి అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. శ్రీనివాసరావు దంపతులకు ఆలయ ధర్మకర్తలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు స్వామి వారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదం అందజేశారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు



కత్తిమండ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలతో సమావేశం ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని సూచించారు. జెడ్పీటీసీలు మట్టా శైలజ, బళ్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య సేవలు

మామిడికుదురు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం పెదపట్నంలంక బొక్కావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు చేతుల పరిశుభ్రత, వర్షాకాలంలో జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాంక్రమిక వ్యాధుల బారిన పడకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు తల్లీ నాగమణి, పసుపులేటి నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ డోర్కాస్, ఆశ కార్యకర్త వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

గోశాలకు రూ.18 వేల వితరణ

రాజోలు: స్థానిక గోశాలకు తన కుమారుడు సూర్య పుట్టినరోజు పురస్కరించుకుని రాజా నాగరత్నకుమార్ రూ.18 వేలు సోమవారం వితరణగా అందజేశారు. గోవులను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి వేడుకల్లో భాగంగా గోశాలకు వితరణ అందిస్తే గోవులకు గ్రాసం సమకూరుస్తారన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

ఆలమూరు: ఆలమూరు నుంచి వెదురుమూడి వెళ్లే కాలువ పంట కాలువలో నిల్వ ఉండిపోయిన గుర్రపుడెక్క, వ్యర్థాలను ఇరిగేషన్ శాఖ తొలగించింది. మండలంలోని శివారు పంట భూములకు సక్రమంగా సాగునీరు పారేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రైతుల విజ్ఞప్తి మేరకు జేఈ కృష్ణ త్రిమూర్తులు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. దీనివల్ల సాగునీరు వేగంగా పారేందుకు మార్గం సుగమమైంది.

పక్కా సీసీ రోడ్లకు శ్రీకారం

- రూ.2.25 కోట్లతో పనులు
- పలు గ్రామాలకు తీరనున్న కష్టాలు
- ఏళ్ల తర్వాత అభివృద్ధికి శ్రీకారం

మామిడికుదురు: ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (ఏఐఐబీ) నిధులతో పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బి.దొడ్డవరం–అప్పనపల్లి, పాశర్లపూడిలంక–ఆదుర్రు గ్రామాల నడుమ పంచాయతీరాజ్ శాఖకు చెందిన రెండు రోడ్లకు సుదీర్ఘ కాలం తర్వాత మోక్షం లభిస్తోంది. ఈ రెండు రోడ్ల అభివృద్ధికి సంబంధించిన పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. పన్నెండున్నర అడుగుల మేర సిమెంట్ కాంక్రీట్ రోడ్డు, దానికి ఇరువైపులా ఏడడుగుల మేర బెర్ములతో పక్కాగా ఈ రోడ్లను తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపట్టారు. ఏఐఐబీ నిధులు రూ.2.25 కోట్లతో ఈ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు.

పద్నాలుగేళ్లకు మోక్షం..

బి.దొడ్డవరంలోని షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి అప్పనపల్లిలోని గ్రామ దేవత కనకమహాలక్ష్మమ్మ ఆలయం వరకు 1.50 కిలోమీటర్ల మేర పీఆర్ రోడ్డు ఆధునీకరణకు రూ.84 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 2009లో ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. నాటి నుంచి నేటి వరకు నాటి పాలకులు ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకోలేదు. పద్నాలుగేళ్ల తర్వాత ఈ రోడ్డుకు మోక్షం లభిస్తోంది. గోదావరి వరదకు దెబ్బతినకుండా పక్కాగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాశర్లపూడిలంక నుంచి లూటుకుర్రు మీదుగా ఆదుర్రు వరకు 1750 మీటర్లు ఉన్న పీఆర్ రోడ్డు అభివృద్ధికి రూ.1.41 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డును చివరిసారిగా 2016



బి.దొడ్డవరం నుంచి అప్పనపల్లి వరకు నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డు పరిస్థితి కూడా ఇంతే. ఈ రెండు లింకు రోడ్లు పాడైపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చాలా ఆనందంగా ఉంది



బి.దొడ్డవరం–అప్పనపల్లి రోడ్డు ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు హడలి పోతున్నారు. ఈ పరిస్థితుల్లో దీని అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కృషితో నిధులు మంజూరయ్యాయి. ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నాం.

– చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, సర్పంచ్, బి.దొడ్డవరం

పటిష్టంగా రోడ్ల నిర్మాణం



నిత్యం వేలాది మంది ప్రయాణించే లింకు రోడ్లను ఏఐఐబీ నిధులతో పక్కా తీర్చిదిద్దుతాం. బి.దొడ్డవరం–అప్పనపల్లి, పాశర్లపూడిలంక–ఆదుర్రు రోడ్లకు పలు గ్రామాలతో కనెక్టివిటీ ఉంది. ఈ రెండు రోడ్లను అభివృద్ధి చేసుకుంటే ప్రజలకు ప్రయాణం ఎంతో సులభతరమవుతుంది. ఈ రెండు రోడ్ల అభివృద్ధి ఇప్పటికే ఎంతో ఆలస్యమైంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ రెండు రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. నెల రోజు వ్యవధిలో ఈ రోడ్ల అభివృద్ధి పనుల్ని పూర్తి చేస్తాం.

– అన్యం రాంబాబు, డీఈఈ, పీఆర్ ప్రాజెక్టు సబ్ డివిజన్, అమలాపురం

పక్కాగా అభివృద్ధి చేస్తున్నాం



పి.గన్నవరం నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల ఆధునీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న రహదారుల్ని పక్కాగా తీర్చిదిద్దుతున్నాం. సుదీర్ఘ కాలం పాటు నిలిచే విధంగా పక్కాగా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో రోడ్లను ఆధునీకరిస్తున్నాం. విమర్శలు చేసిన వాళ్ల నోళ్లు మూయిస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాం.

– కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్యే, పి.గన్నవరం

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు



గోగన్నమఠంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గోగన్నమఠంలో గ్రామీణ ఉపాధి పథకం నిధులు రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థతో పాటు గ్రామ సచివాలయ వ్యవస్థ కూడా ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీఎం జగన్ ముందు చూపుతో ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారిందని వరప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబురాజు, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్‌ఎస్ నర్సింహవర్మ, మాజీ చైర్మన్ ముత్యాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, బళ్ల శ్రీనివాసరావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సాగి సత్యనారాయణరాజు, సూరిశెట్టి బాబి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పరిశీలన



గంటి పల్లిపాలెంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గంలో రోడ్ల సమస్య పరిష్కారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేయించడం ద్వారా యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేపట్టినట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెల–పల్లిపాలెం రోడ్డును గతంలో రూ.1.40 కోట్లతో నిర్మాణం చేపట్టగా నిధులు సరిపోక ఊతకోట–గన్నవరం ప్రధాన రహదారి నుంచి పల్లిపాలెం వంతెన వరకూ 1.01 కిలోమీటర్ల రోడ్డు మిగిలిపోయింది. జగ్గిరెడ్డి ప్రతిష్టాత్మక కృషితో ఆ రోడ్డుకు రూ.90 లక్షలు మంజూరు కాగా గ్రామంలో 650 మీటర్లు మేర సీసీ రోడ్డు, మిగిలింది బీటీ రోడ్డుగా నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ రోడ్డు నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతుంది. దానిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. రోడ్డు నాణ్యత గురించి అధికారులను ఆరా తీశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా సీఎం జగన్ ఓ పక్క సంక్షేమ పథకాలు క్యాలెండర్ ప్రకారం అమలు జరుగుతుండగా మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని అనేక రోడ్లు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసుకున్నామన్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు, ఎంపీటీసీ ముళ్ల జనార్దనరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ భూపతిరాజు సత్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పంతగాని శామ్యూల్, నేరేడుమిల్లి నరేష్ పాల్గొన్నారు.

రైతులకు అన్నింటా పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్ పాలనలో రైతులను అన్నింటా పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం శానపల్లిలంకలో రూ.20 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే కొండేటి మాట్లాడుతూ సీఎం జగన్ రైతులు పండించిన పంటను దళారీలు అయిన కాడికి అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి అండగా నిలిచారన్నారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందించి రైతులను అప్పులు పాలు కాకుండా కాపాడన్నారు. సబ్సిడీపై యంత్రాలు, చిన్నట్రాక్టర్లు, అందిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో గృహసారథులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే చిట్టిబాబు గృహ సారథులకు భీమాపై అవగాహన కల్పించారు. గృహ సారథుల కుటుంబాలకు రక్షణగా సీఎం జగన్ ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంబల కుమారి, ఎంపీటీసీ పచ్చిమాల సుబ్బారాజు, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, శానపల్లిలంక పీఏసీఎస్ అధ్యక్షుడు మట్టపర్తి రామారావు తదితరులు ఉన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

అయినవిల్లి: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా 20 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. మండలంలో విద్యుత్ సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కనీసం పట్టించుకోవాలని ప్రజా ప్రతినిధులు ఆరోపించారు. మండలంలోని మడుపల్లి నుంచి ముక్తేశ్వరం వరకూ రహదారి, ముక్తేశ్వరం నుంచి కొండుకుదురు వరకూ రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే చిట్టిబాబు స్పందిస్తూ త్వరలో ఈ రహదారుల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇరిగేషన్ ఏఈ ఈ సమావేశానికి రాకుండా దిగువ స్థాయి ఉద్యోగిని పంపంపించడంపై పలువురు ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. అలాగే మండలంలోని పలు శాఖలకు చెందిన సమస్యలను ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆక్వా సాగుతో ఇబ్బందులు

ఆత్రేయపురం: స్థానిక పెదహరిజన వాడలో ఆక్వా సాగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ పేటలో పలువురు ఎంపీడీఓ నాతిబుజ్జికి వినతి పత్రం అందజేశారు. ఆక్వా చెరువులు సమస్య తీర్చిన తరువాతే ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇప్పించాలని పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. దీనిపై సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ కాలాబత్తుల సీత, చిన్నారి, కాకి లక్ష్మి, లంబా నాగమణి, కాంతలక్ష్మి, యాలంగా ధర్మారావు, నేరేడుమిల్లి సత్యవతి, పాల్గొన్నారు.

త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలి

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో తీవ్ర జాప్యం జరుగుతున్న సీసీ రోడ్డు పనుల టెండర్లను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆగ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హిమాన్షుశుక్లాకు స్పందనలో దరఖాస్తు అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం పథకానికి సంబంధించి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వరిలో కలుపు నివారణకు చర్యలు



వరి పంటలో కలుపు తొలగిస్తున్న కూలీలు

ఆత్రేయపురం: విచక్షణా రహితంగా పురుగుమందులు వినియోగించడం పంటలకు అనర్థమని ఆత్రేయపురం మండల వ్యవసాయ శాఖాధికారి జేవీ పట్టాభిరామయ్య రైతులకు సూచించారు. పురుగు మందులు అధికంగా వినియోగించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ కూడా తక్కువ ఉంటుందన్నారు. వరి పైరులో కలుపును సకాలంలో నివారించుకుంటే దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. వరి నాట్లు ప్రారంభం నుంచే కలుపు నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిలో ఊద తదితర గడ్డి జాతి మొక్కలు ఉంటే బ్యుటాక్లోర్ 50 శాతం 1 నుంచి 1.5 లీటర్లు లేదా అనిలోఫాస్ 30 శాతం 500 మిలీ లేదా ప్రెటిలాక్లోర్ 50 శాతం 500 మి.లీ ఏదో ఒక దానిని ఎకరాకు 25 కిలోల పొడి ఇసుకలో కలిపి, నాటిన 3 నుంచి 5 రోజుల్లో పలచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలి. 35 నుంచి 50 గ్రాముల ఆక్సాడయార్జిల్ 80 శాతం పొడి మందును 500 మి.లీ నీటితో కలిపి ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకతో కలిపి నాటిన 3 నుంచి 5 రోజుల్లో పలచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలి. వరి నాట్లు వేసిన 8 నుంచి 10 రోజుల తరువాత కూడా కలుపు మొక్కలు ఉంటే పైరజోసల్ఫ్యూరాన్ 15 శాతం ఎకరాకు 50 గ్రాముల చొప్పున 200 లీటర్లు నీటితో కలిపి పొలంలో నీటిని తీసి వేసిన తరువాత సమానంగా పిచికారీ చేయాలి. వరి నాట్లు వేసిన 25–30 రోజులప్పుడు పొలంలో వెడల్పాటి కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరాకు 400 గ్రాములు 2, 4–డి సోడియం సాల్ట్ 80 శాతం పొడి మందును 200 లీటర్ల నీటితో కలిపి పొలంలో నీటిని తీసిన తరువాత కలుపు మొక్కలపై పడేటట్లు పిచికారీ చేయాలి. అలాగే పురుగు మందుల కొనుగోలులో జాగ్రత్తల గురించి వివరించారు. పైరును ఆశించింది కీటకమా లేక తెగులా అనేది రైతులు ముందుగా నిర్ధారించుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మందులు మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పారు. లీకేజీ లేని, సీలు సరిగ్గా ఉన్న సస్యరక్షణ మందులనే కొనాలని, విష ప్రభావం కోల్పోయే తేదీని గమనించాలని తెలిపారు. కొనుగోలు చేసేటప్పుడు షాపు యజమాని నుంచి రశీదు తప్పక తీసుకోవాలన్నారు. అలాగే సిఫారసు చేసిన మోతాదు, సిఫారసు చేసిన దఫాల్లోనే పురుగుమందులు వాడాలని, ఒకే రకం మందు ఎక్కువ సార్లు వాడకూడదని పట్టాభిరామయ్య సూచించారు. మూడు రకాల పురుగు మందులు కలిపి పిచికారీ చేయకూడదని, పైరు పై నుంచి కింది వరకూ పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలని తెలిపారు.

మహిళలను వేధిస్తే చట్టపరంగా శిక్షిస్తాం



ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దిశా డీఎస్పీ మురళీమోహన్

అయినవిల్లి: మహిళలను, బాలికలను, యువతలను వేధిస్తే చట్టపరంగా శిక్షిస్తామని దిశా డీఎస్పీ మురళీమోహన్ అన్నారు. సోమవారం ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్ ఉత్తర్వులు, అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా ఆదేశాల మేరకు విద్యార్థులకు మహిళ రక్షణ, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, చట్టాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్ అబ్యూస్ సైబర్ క్రైమ్స్ మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీమోహన్ తన సిబ్బందితో కలసి అయినవిల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్కూల్ హెచ్‌ఎం, టీచర్స్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

అమలాపురం టౌన్: పట్టణంలోని గంగరాజు ఫంక్షన్ హాలులో వసుధ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో తయారైన వస్త్రాలతో ఏర్పాటైన ఎగ్జిబిషన్ మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. విద్యార్థినులు, మహిళల చేసే విక్రయాలకు అనుగుణంగా దేశంలోని ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకువచ్చి పట్టణ ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ పేర్కొన్నారు. దేశంలో పలు ప్రాంతాలకు చెందిన 50 మందికి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్టు వారు తెలిపారు.

నేడు లయన్స్ క్లబ్‌లో చెస్ పోటీలు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా చెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం లయన్స్ క్లబ్‌లో అండర్–15 చెస్ పోటీలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపించిన నలుగురు బాలికలు, నలుగురు బాలురను ఎంపిక చేసి అనంతపురంలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపించనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2008 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9849175179 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

కార్డియాక్ క్లినిక్ ప్రారంభం

అమలాపురం టౌన్: కార్డియాలజీ వైద్య విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న డాక్టర్ గేదెల అభిషేక్ వర్మ అమలాపురంలో అత్యాధునిక అభిషేక్ కార్డియాక్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ క్లినిక్‌ను ఆయన తల్లిదండ్రులు డాక్టర్ గేదెల రమేష్, డాక్టర్ వరలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. గుండెకు సంబంధించి అన్ని అత్యాధునిక వైద్య వసతులు ఏర్పాటు చేసినట్టు అభిషేక్‌వర్మ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తోట సందీప్, డాక్టర్ గేదెల లక్ష్మీ దీప్తితో పాటు కోనసీమకు చెందిన పలువురు వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు: ఇటీవల కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరం ఎస్సై పి.సురేష్ సూచించారు. విలువైన వస్తువులైన బంగారం, వెండి ఇతర వస్తువులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా ఇళ్ల నుంచి బయటకు వెళ్లే సందర్భంలో విలువైన వస్తువులను జాగ్రత్త పర్చుకోవాలన్నారు. ఊరు వదిలి వెళ్లే సమయంలో ఆ విషయాన్ని నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని లేని పక్షంలో సచివాలయ మహిళా పోలీస్ ద్వారా తెలియపర్చాలన్నారు. దీని వల్ల ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాన్ని అమర్చడం జరుగుతుందన్నారు. దీని ద్వారా చోరీలను అరికట్టడం, ఎవరైతే దొంగతనం చేశారో వారిని పట్టుకోవడానికి అవకాశం దొరుకుతుందని ఎస్సై సురేష్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని నేర నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి చర్యలు

పి.గన్నవరం/అంబాజీపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఒక సహాయకురాలి పోస్టులను భర్తీ చేస్తున్నట్టు సీడీపీఓ వై.విజయలక్ష్మి తెలిపారు. అంబాజీపేట మండలం నందంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త (ఎస్టీ), పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు గుడ్డాయలంక కేంద్రంలో సహాయకురాలి (ఓసీ–జనరల్) పోస్టులను భర్తీ చేస్తామని ఆమె వివరించారు. అర్హత గల అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సీడీపీఓ విజ్ఞప్తి చేశారు.

ఆలమూరు మండలంలో..

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.శారద తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ స్థానిక బీసీ ఏరియాలో ఖాళీగా ఉన్న పోస్టును ఓసీ జనరల్‌కు కేటాయించామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానిక వివాహితులై ఉండి పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. జూలై 1 2023 నాటికి 21 ఏళ్లు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, స్థానిక, కుల ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నకళ్లను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తును కొత్తపేట ఐసీడీఎస్ కార్యాలయం పనివేళల్లో ఈనెల 31 లోపు అందజేయాలని, దరఖాస్తుదారులకు సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని సీడీపీఓ పేర్కొన్నారు. ఇతర వివరాలకు సమీప అంగన్‌వాడీ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ఉల్లి కషాయంతో పురుగుల నివారణ

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఉల్లి కషాయంతో కొబ్బరి తోటలను ఆశించే పురుగులు, తెగుళ్లు నివారించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రాధిక అన్నారు. కె.పెదపూడిలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ నాగవరపు శ్రీనివాసరావు, ఐసీఆర్పీ కుడుపూడి లక్ష్మీదుర్గల ఆధ్వర్యంలో ఉల్లికషాయం తయారీ విధానంపై సోమవారం రైతులకు వివరించారు. ఉల్లిపాయలు 10 కేజీలు, వెల్లుల్లి 2 కేజీలు, పసుపు కేజీ, ఉమ్మెత్తాకు 5 కేజీలు, సీతాఫలాకులు 2 కేజీలు, వేప 5 కేజీలు వీటన్నంటి బాగా కలిపి వేయి లీటర్ల నీటిలో మరిగించాలన్నారు. 24 గంటలు తరువాత 10 లీటర్ల ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా కొబ్బరి తోటకు మొదలు కాకుండా చివరి భాగంలో పిచికారీ చేయాలన్నారు. దీని వలన నల్లి, తెల్ల దోమను నివారించవచ్చన్నారు. అనంతరం గుంటూరి కృష్ణంరాజు కొబ్బరితోటలో ఉల్లి కషాయంతో పిచికారీ చేసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పి.సత్యమణి, సీహెచ్ శ్యామల, రైతులు పాల్గొన్నారు.

29న అముడా చైర్మన్‌గా డేవిడ్‌రాజు ప్రమాణం



కొత్తపేట: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్‌గా గొల్లపల్లి డేవిడ్‌రాజు ఈ నెల 29న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తూ విశ్వసనీయత చాటుకున్నారు. ఆ నేపథ్యంలో జగ్గిరెడ్డి సిఫారసు మేరకు సీఎం జగన్ అముడా చైర్మన్‌గా డేవిడ్‌రాజును నియమించారు. డేవిడ్‌రాజు ప్రమాణ స్వీకార వివరాలను ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు సోమవారం విలేకరులకు వివరించారు. 29న నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా కొత్తపేట నుంచి అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో డేవిడ్‌రాజు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

మామిడికుదురు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. 22న మంగళవారం కరవాక, మగటపల్లి, ఆదుర్రుల్లోను, 23న గోగన్నమఠం, కొమరాడ, పెదపట్నం గ్రామాల్లోను శిబిరాలు జరుగుతాయన్నారు. 24న లూటుకుర్రు, పాశర్లపూడిలంక, మొగలికుదురు గ్రామాల్లోను, 25న పెదపట్నంలంక, ఈదరాడ, మామిడికుదురు–1 గ్రామాల్లోను శిబిరాలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రత్యేక ఆధార్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సూచించారు.

ప్లకార్డు ప్రదర్శన

సఖినేటిపల్లి: గత పన్నెండేళ్ల నుంచి సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సోమవారం స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపచేయాలని, జూలై నెల జీతాల బడ్జెట్ విడుదల చేయాలని వారు కోరారు.